సాక్షి ఖమ్మం

శుక్రవారం । 9 । మే । 2025



కరువు తీర్చిన 'రామదాసు'

భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా విడుదలైన నీటితో మండు వేసవిలోనూ పలు చెరువులు కళకళలాడుతున్నాయి. 10లో



ప్రభుత్వ బడుల్లో శిబిరాలు

జిల్లాలోని 46 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 10నుంచి 24వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
38° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరుజల్లులు కురిసే అవకాశముంది. మిగతా చోట్ల సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మానవ వనరుల అభివృద్ధే లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- వైద్య, ఆరోగ్య శాఖకు రూ.11,482 కోట్ల నిధులు
- రఘునాథపాలెంలో మెడికల్ కాలేజీ నిర్మాణాలకు శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల, పొంగులేటి



సభలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనరసింహ, వేదికపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యే రాగమయి, రాందాస్ తదితరులు

ఖమ్మం అర్బన్: మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ, పకడ్బందీ చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రఘునాథపాలెంలో రూ.130 కోట్లతో నిర్మించే ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన సముదాయానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి అవసరమైన భూమి, నిధులు సమకూర్చడంలో మంత్రులు కీలక పాత్ర పోషించారన్నారు. గత ప్రభుత్వం ఏటా సగటున వైద్య రంగానికి రూ.5,959 కోట్లు వెచ్చిస్తే, తాము ఒక్క ఏడాదిలోనే రూ.11,482 కోట్లు కేటాయించామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. అంతేకాక అంతర్జాతీయ ప్రమాణాలతో 58 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను రూ.11,600 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే, 57 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్న భట్టి, మరో 30 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలని సూచించారు. ఏదేమైనా ఉద్యోగులను తాము కాపాడుకుంటామని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఉద్యోగులకు ఏనాడు 15వ తేదీ లోపు జీతాలు ఇవ్వలేదని తెలిపారు.

వైద్య రంగానికి ప్రాధాన్యత

ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఖమ్మం మెడికల్ కళాశాలలో సీట్లు 150కి పెంచుతామని, జిల్లాలో 6–7 ప్రైమరీ హెల్త్ సెంటర్ల మంజూరుతో పాటు ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్ కేటాయించనున్నామని చెప్పారు. వందనం, కొదుమూరు ప్రాంతంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. అలాగే, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుతో మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాల శంకుస్థాపన ఆలస్యమైనా కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందని చెప్పారు.

రైతులకు భూమి పట్టాల పంపిణీ

ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి బల్లేపల్లి వద్ద సేకరించిన భూముల్లో అసైన్డ్ భూములు కూడా ఉన్నాయి. ఈనేపథ్యాన శంకుస్థాపన సభావేదికపైనే ఆయా రైతులకు నివాస స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు ఎకరాకు 300గజాల చొప్పున 28మందిలో ఐదుగురికి మంత్రులు పట్టాలు అందజేశారు. మిగతా వారికి త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా, సీతారామలింక్ కెనాల్ నిర్మాణం పూర్తయినందున తమ వద్ద సేకరించిన భూములకు పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరారు. రైతులు బి.నర్సింహారావు, జి.సురేష్, కృష్ణ, శోభన్ తదితరులు మంత్రులకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు బ్రాండ్!



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో వైద్య, ఆరోగ్య రంగంలో చేయాల్సిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై మంత్రులు సి. దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి కలెక్టరేట్‌లో సమీక్షించారు. తొలుత జిల్లా పరిస్థితులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అవసరమైన చోట పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, బస్తీ దవాఖానాల ఏర్పాటు, కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్య 100 నుంచి 150 వరకు పెంచాలని, పెద్దాస్పత్రిని 600 పడకలకు విస్తరించాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ ఆస్పత్రులకు బ్రాండింగ్ కల్పించేలా హెల్ప్ డెస్క్, రిసెప్షన్, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం వైద్య కళాశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పలు ప్రతిపాదనలు సమర్పించారు.

పేదలకు మెరుగైన వైద్యం



ప్రభుత్వ ఆస్పత్రిలో ఇచ్చే భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దామోదర రాజనరసింహ, తుమ్మల

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంగా వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. భట్టితో పాటు మంత్రులు సి.దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు జిల్లా పెద్దాస్పత్రిని తనిఖీ చేయగా పలు విభాగాల్లో పరిశీలించి చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. వైద్య సేవలెలా ఉన్నాయి, మందులు ఇస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, వైద్యారోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఐడీసీ ఎండీ ఫణీందర్‌రెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్వో ఏ.పద్మశ్రీ, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, హస్తకళల సంస్థ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మేయర్ పి.నీరజ, డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి, ఆర్‌డీఓలు నర్సింహారావు, రాజేందర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, ఆర్ అండ్‌బీ అధికారి యాకుబ్‌తో పాటు ఫాతిమా జోహరా, లకావత్ సైదులు, కమర్తపు మురళి, రావూరి సైదబాబు, బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, తుళ్లూరు బ్రహ్మయ్య, సాధు రమేష్‌రెడ్డి, మలీదు వెంకటేశ్వర్లు, భూక్యా బాషా, తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ జట్ల ఎంపిక



ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గాను ఉమ్మడి జిల్లా స్థాయి బాలబాలికల చెస్ జట్లను ఎంపిక చేశారు. చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్–7, 9, 11 కేటగిరీల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతిభ చాటిన వారితో జిల్లా జట్లు ఎంపిక చేశామని చెస్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఉమ్మడి జిల్లా అండర్–7 బాలబాలికల జట్లకు ప్రీతమ్, జుహిత్, ఆరాధ్య, శ్రియశ్రీ, అండర్–9 విభాగంలో నిఖిల్, విహాన్, కృతిప్రీతిక, హరిప్రియశ్రీ, అండర్–11 విభాగంలో అక్షయ్‌కుమార్, సీహెచ్.గౌతమ్‌కృష్ణ, హిమశ్రీనిక, రీతూశ్రీ ఎంపికయ్యారు. ఈ పోటీలను అసోసియేషన్ బాధ్యులు సీహెచ్.గోపీకృష్ణ, సాంబశివరావు, రామారావు, అరుణ, స్వాతి, భిస్వజిత్, కృష్ణ, జ్యోత్స్న పర్యవేక్షించారు.

నేడు జిల్లాకు మాజీ మంత్రి కేటీఆర్

తల్లాడ: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు శుక్రవారం తల్లాడ మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11–30 గంటలకు తల్లాడ మండలం రేజర్లకు హెలీకాప్టర్‌లో రానున్న ఆయన అక్కడి నుంచి రోడ్డుమార్గంలో మిట్టపల్లికి చేరుకుని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఆతర్వాత అక్కడే జరిగే సభలో మాట్లాడాక తిరిగి రోడ్డు మార్గంలో రేజర్లకు, హెలీకాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరతారు. కాగా, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యవేక్షణలో విగ్రహావిష్కరణ, సభ ఏర్పాట్లు పూర్తిచేశారు. సభకు వచ్చే వారు ఎండ కారణంగా ఇబ్బంది పడకుండా షామియానాలు, కూలర్లు అమరుస్తున్నారు. ఇక విగ్రహావిష్కరణ సందర్భంగా హాజరయ్యే వారికి శేషగిరిరావు కుటుంబీకులు అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మేలైన విత్తనాల ఎంపికతో మంచి దిగుబడి



మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య

చింతకాని: రైతులు పంటల సాగు సమయాన శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించొచ్చని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. చింతకానిలోని రైతువేదికలో గురువారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'లో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడం, మేలురకపు విత్తనాలను ఎంపికతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. అలాగే, విత్తనాలు, ఎరువుల రశీదులను పంట పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఎరువులను అవసరం మేరకు వాడుతూ నేల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, ఫణిశ్రీ, ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రామకృష్ణ, ఏడీఏ విజయ్‌చంద్ర, ఉద్యాన అధికారి విష్ణు, ఏఓ మానస, పశువైద్యాధికారి రాంజీ పాల్గొన్నారు.

వైరా ఏసీపీగా సారంగపాణి



సారంగపాణి

వైరా: వైరా ఏసీపీ ఎం. ఏ.రెహమాన్‌ను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆయన స్థానంలో హైదరాబాద్ పోలీస్ అకాడమీలో పనిచేస్తున్న ఎస్.సారంగపాణిని నియమించారు. సుమారు మూడేళ్ల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించిన రెహమాన్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన మరో నాలుగు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనుండగా, బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఖమ్మం క్రైం: ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీ పి.రవీందర్‌రెడ్డిని వరంగల్ జిల్లా నర్సంపేట ఏసీపీగా బదిలీ చేశారు. అయితే, ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

మార్కెట్‌కు ఎండాకాలం సెలవులు

ఈనెల 12నుంచి జూన్ 6వరకు ప్రకటన

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 12 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యాన ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్, కార్మిక వర్గాల అభ్యర్థనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం వానాకాలంలో సాగు చేసిన మిర్చి, యాసంగిలో సాగు చేసిన పెసర, మినుము, కందులు, మొక్కజొన్న పంటలు విక్రయానికి వస్తున్నాయి. అయితే, మిర్చి క్రయవిక్రయాలు తగ్గడం, ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యాన సెలవులు కావాలని కార్మిక వర్గాలు చాంబర్ ఆఫ్ కామర్స్‌కు లేఖ ఇవ్వడంతో ఈ లేఖ ఆధారంగా మార్కెట్ కమిటీని అభ్యర్థించడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సెలవులు ప్రకటించారు. ఇందులో భాగంగా ఈనెల 12నుంచి జూన్ 6వరకు సెలవులు ఇస్తున్నట్లు మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే, 6, 8వ తేదీల్లో వారాంతం అయినందున 9వ తేదీ నుంచి కొనుగోళ్లు మొదలుపెడతామని, అప్పటివరకు రైతులు పంటలు తీసుకురావొద్దని కోరారు. ఆ సమయానికి రైతులు నిల్వ చేసిన పత్తి, మిర్చి, అపరాలను వానాకాలం పంటల సాగు పెట్టుబడుల కోసం విక్రయానికి తీసుకురానున్నారు.

సర్వర్ పనిచేయక మిర్చి కొనుగోళ్లలో జాప్యం

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మిర్చి కొనుగోళ్లకు జాప్యం జరిగింది. మార్కెట్‌లో ప్రతి రోజు ఉదయం 7–30 గంటలకు జెండాపాట ద్వారా గరిష్ట ధర నిర్ణయించారు. అంతేకాక ఈ–నామ్ విధానంలో లాట్ ఐడీల కేటాయింపు మొదలుపెట్టారు. ఆతర్వాత ఎనిమిది గంటల సమయాన సర్వర్ స్తంభించడంతో 30నిమిషాలకు పైగా ఐడీల జారీకి అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత సర్వర్ అందుబాటులోకి రావడంతో ప్రక్రియ ప్రారంభించారు. ఈ విషయంపై మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శి సృజన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఎదురైందని, సర్వర్ అందుబాటులోకి రాగానే ఐడీలు కేటాయించి అంతరాయం లేకుండా కొనుగోళ్లు చేపట్టామని తెలిపారు.

సుమనోహరం.. రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆరు నెలల పాటు సమ్మె నిషేధం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఆరు నెలల పాటు సమ్మెను నిషేధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేయగా.. సింగరేణి యాజమాన్యం గురువారం రాత్రి ఇదే విషయాన్ని ప్రకటించింది. రాష్ట్రంలోని అత్యవసర సర్వీసుల మెయింటెనెన్స్ యాక్ట్ 1971(1971 కంపెనీ యాక్ట్–20) సెక్షన్‌లోని సబ్– సెక్షన్,(1), (3) కింద సింగరేణి సంస్థ వస్తున్నందున ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆరు నెలల పాటు సమ్మె నిషేధమని పేర్కొంది.

భద్రతకు సవాల్‌గా మారిన ఉగ్రవాదం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన హేమంతరావు, నాయకులు

రఘునాథపాలెం: ఉగ్రవాదం దేశ భద్రతకు పెను సవాల్‌గా మారిన నేపథ్యాన.. అది ఏ రూపంలో ఉన్నా తుద ముట్టించాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేలా కవ్వింపు చర్యలకు పాల్పడడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఐ శత వసంతాల సందర్భంగా రఘునాథపాలెం మండలం ఈర్లపుడిలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించగా, ఆతర్వాత జరిగిన సభలో కూనంనేని మాట్లాడారు. దేశంలో నానాటికీ సంపన్నుల సంఖ్య పెరుగుతుండగా, బడుగు ప్రజల ఆర్థిక పరిస్థితి దిగజారుగుతోందని తెలిపారు. కనీస జీవనాధారం లేని కుటుంబాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. మతం పేరుతో కర్మ సిద్ధాంతాన్ని ప్రోత్సహించడాన్ని ఆయన తప్పుపట్టారు. కాగా, ప్రజలు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దాన్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఇక స్వాతంత్ర్య సమరం, సాయుధ తెలంగాణ పోరాటంలోనూ కీలకపాత్ర పోషించిన సీపీఐ ద్వారా ప్రజలకు హక్కులు లభించాయని, ఈ స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాడుతామని కూనంనేని వెల్లడించారు. ఈ సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కే.జానీమియా, శింగు నర్సింహారావు, శాఖమూరి శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వర్లు, అజ్మీరా రామ్మూర్తి, పగడాల మల్లేష్, నాయకులు వరద నర్సింహారావు, బాగం ప్రసాద్, వెంకయ్య, బానోత్ రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 1,654 మంది అతిథి అధ్యాపకులను కొనసాగించచడంతో పాటు పెండింగ్ వేతనాలు ఇప్పించేలా కృషి చేయాలని అతిథి అధ్యాపకురాలు సాదిన్ని రజిని తదితరులు కూనంనేనికి వినతిపత్రం అందజేశారు.

వీడని వర్షం, ఈదురుగాలులు

- జిల్లాలో పగలంతా ఎండ, సాయంత్రానికి మార్పు
- ధాన్యం కాపాడుకునేందుకు రైతుల అవస్థలు



ఏన్కూరులో ధాన్యంపై పట్టా కప్పుతున్న రైతు



ఎర్రుపాలెంలో రహదారికి అడ్డంగా పడిన చెట్టు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉపరితల ద్రోణి కారణంగా కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పగలు ఎండ తీవ్రత ఉంటుండగా.. సాయంత్రానికి 30 – 40 కి.మీ. మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ వడగండ్లతో కూడిన వర్షం కురుస్తోంది. గురువారం సాయంత్రం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం అత్యధికంగా నేలకొండపల్లిలో 41.2, బాణాపురంలో 41, పమ్మిలో 40.9, చింతకానిలో 40.7, కాకరవాయి, బచ్చోడులలో 40.5, రఘునాథపాలెంలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక సాయంత్రం 7గంటల సమయానికి సత్తుపల్లి ఓసీ వద్ద 16, వైరా ఏఆర్‌ఎస్ వద్ద 14.8, ఏన్కూరులో 14, తిమ్మారావుపేటలో 12.8, బచ్చోడులో 9.8, మధిరలో 8.5, గుబ్బగుర్తిలో 4.5, మధిర ఏఆర్‌ఎస్ వద్ద 3.8, గేటు కారేపల్లి వద్ద 3.3, కాకరవాయిలో 3 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా, ఈదురుగాలులు, అకాల వర్షాలతో యాసంగి పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, మక్కలు, మిర్చిని కాపాడుకునేందుకు అవస్థ పడుతుండగా.. కోత దశలో మామిడి పంట నేలరాలుతుండగా ఆవేదన చెందుతున్నారు. ఇక ఈదురుగాలులు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.

ఏన్కూరు: మండలంలో గురువారం సాయంత్రం భారీవర్షం కురిసింది. గాలిదుమారం, ఉరుములు, మెరుపులతో భారీవర్షంతో ధాన్యం కప్పిన పరదాలు ఎగిరిపోయాయి. గాలివాన బీభత్సంతో అక్కడక్కడా చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.

తల్లాడ: తల్లాడ మండలంలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసింది. గన్నీ సంచులు, లారీల కొరతతో కొనుగోళ్లు ఆలస్యమవుతుండగా, వర్షంతో నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు.

ఎర్రుపాలెం: మండల వ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. జమలాపురం వెళ్లే రహదారి, మండల కేంద్రంలోని బైపాస్ ,మీనవోలు – మధిర రోడ్డులో చెట్లు విరిగి రహదారికి అడ్డంగా పడగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే, మామిడి తోటల్లో కాయలు నేలరాలగా, గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ముందస్తు.. అంతంతే

- మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్‌కు నామమాత్ర స్పందన
- రూ.64.08 కోట్ల డిమాండ్‌లో రూ.6.19 కోట్లే వసూలు
- ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో సత్తుపల్లిలో అత్యధికం



సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయం



ముందస్తుగా పన్ను చెల్లిస్తున్న సత్తుపల్లి సొసైటీ ఉద్యోగులు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీల్లో ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే అత్యధికంగా ఆస్తి పన్ను రాబట్టేలా రాష్ట్రప్రభుత్వం ఏటా మాదిరిగా ఐదు శాతం రాయితీతో ఈసారి కూడా ఎర్లీ బర్డ్ స్కీంను ప్రకటించింది. కానీ రాష్ట్ర పురపాలక శాఖ ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఈసారి స్పందన అంతంత మాత్రంగానే లభించింది. ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రచార బోర్డులు ఏర్పాటు చేసి ప్రచారం చేయగా.. పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్నులు చెల్లించారు. కానీ గతంతో పోలిస్తే ఈసారి ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక,. విచారణలో బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు నిమగ్నమవడంతో ఎర్లీబర్డ్‌పై విస్తృతంగా అవగాహన కల్పించలేకపోయారు. దీంతో పన్నుల వసూళ్లపై ప్రభావం చూపింది.

సద్వినియోగం చేసుకున్నారు..

2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇవ్వడం ఎర్లీబర్డ్ పథకం ఉద్దేశం. ఏటా ఈ పథకం ద్వారా ఎక్కువ మొత్తం పన్ను రాబట్టేలా మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు కృషి చేస్తారు. కానీ ఈసారి పాలకవర్గాలు లేకపోగా.. అధికారులు ఇతర పని ఒత్తిడిలో పెద్దగా దృష్టి సారించలేదు. ఫలితంగా వసూళ్లలో వెనుకంజ వేసినట్లయింది. ఈసారి ఏప్రిల్ 30వ వరకు ఉన్న గడువును ఈనెల 7వ తేదీ వరకు పొడిగించినా ఆశించిన స్థాయిలో పన్నులు వసూలవకపోవడం గమనార్హం.

కొంచెం ఆశ.. ఇంకొంచెం నిరాశ

ఎర్లీబర్డ్ పథకంలో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇల్లెందు(శాతంలో) అగ్రస్థానాన నిలిచింది. ఇక్కడ అత్యధికంగా 1,384 మంది రూ.56 లక్షలు చెల్లించారు. మొత్తం రూ.2.23 కోట్ల ఆస్తి పన్ను డిమాండ్‌లో 25.11 శాతం వసూలైంది. ఇక సత్తుపల్లి 25.04 శాతం (రూ.1.42కోట్లు)తో ద్వితీయ స్థానాన నిలిచింది. మణుగూరులో 18.30శాతం, మధిరలో 15.85 శాతం, కొత్తగూడెంలో 10.88 శాతం, వైరాలో 10.15శాతం, పాల్వంచలో 3.92 శాతం మాత్రమే పన్ను వసూళ్లు నమోదయ్యాయి.

మున్సిపాలిటీ	పన్ను డిమాండ్	చెల్లించిన యజమానులు	వసూలైన పన్నులు	శాతం
ఇల్లెందు	రూ.2.23కోట్లు	1,384	రూ.56 లక్షలు	25.11
సత్తుపల్లి	రూ.5.67 కోట్లు	2,080	రూ.1.42కోట్లు	25.04
మణుగూరు	రూ.2.35కోట్లు	1,244	రూ.43లక్షలు	18.30
మధిర	రూ.4.01 కోట్లు	1,720	రూ.65 లక్షలు	15.85
కొత్తగూడెం	రూ.12.87కోట్లు	3,026	రూ.1.40కోట్లు	10.88
వైరా	రూ.4.53కోట్లు	828	రూ.46 లక్షలు	10.15
పాల్వంచ	రూ.32.42కోట్లు	3,153	రూ.1.27కోట్లు	3.92

కేఎంసీకి రూ.10.73 కోట్లు !

ఖమ్మంమయూరిసెంటర్: ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు భారీగా ఆదాయం సమకూరింది. ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఐదు శాతం రాయితీతో ఈ పథకాన్ని ప్రకటించడమే కాక పొడిగించిన గడువు బుధవారంతో ముగిసింది. ఈమేరకు కేఎంసీకి రూ.10.73 కోట్లు ఆదాయం నమోదైంది. ఏప్రిల్ 30వ తేదీ వరకు రూ.10.13 కోట్లు రాగా.. ఈనెల 1నుంచి 7వ తేదీ వరకు రూ.60 లక్షలు ఆదాయం రావడం విశేషం. అయితే, గురువారం కూడా పన్నులు చెల్లించేందుకు పలువురు కార్యాలయానికి రాగా సైట్ నిలిచిపోయిందని చెప్పడంతో వెనుదిరిగారు.

క్లుప్తంగా

పగటి పూట మూడు ఏసీ బస్సులు



బస్టాండ్‌లో పరిశీలిస్తున్న డిప్యూటీ ఆర్‌ఎం మల్లయ్య

సత్తుపల్లిటౌన్: వేసవి దృష్ట్యా సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు పగటి పూట మూడు రాజధాని ఏసీ బస్సులు నడిపిస్తున్నామని ఆర్టీసీ ఖమ్మం డిప్యూటీ రీజనల్ మేనేజర్ మల్లయ్య తెలిపారు. ఈ బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సత్తుపల్లి బస్టాండ్‌ను సందర్శించిన ఆయన డిపోలో రికార్డుల తనిఖీ అనంతరం మాట్లాడారు. ప్రయాణికుల కోసం అన్ని బస్టాండ్లలో చల్లని తాగునీరు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. అలాగే, పాల్వంచ, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి ప్రయాణికుల కోసం సత్తుపల్లి బస్టాండ్‌లో అదనపు ప్లాట్‌ఫాంపై షెడ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితీ, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు తీసుకున్న వ్యక్తి జారీ చేసిన చెక్కు చెల్లకపోవడంతో ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన ధనావత్ గోవింద్ వద్ద శ్రీనగర్ కాలనీకి చెందిన నెల్లూరు సతీష్ రెండు సార్లు రూ.లక్ష చొప్పున 2018లో అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించే క్రమాన 2019 సెప్టెంబర్ 24న రూ.2 లక్షలకు చెక్కు జారీ చేశాడు. అయితే, సతీష్ ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు తిరస్కరణకు గురైంది. దీంతో గోవింద్ తన తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం సతీష్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.2లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కరువు తీర్చిన 'రామదాసు'

- మండు వేసవిలోనూ చెరువుల జలకళ
- పాలేరు జలాలతో తాగు, సాగునీటి కష్టాలకు చెక్



నిండుకుండలా ఉన్న బచ్చోడు చెరువు

తిరుమలాయపాలెం: వేసవి వచ్చిందంటే తాగునీటితో పాటు వర్షాలు కురిసే వరకు సాగునీటికి జిల్లాలోని తిరుమలాయపాలెం మండల ప్రజలు, రైతులు కష్టాలు ఎదుర్కొనేవారు. కానీ ఈసారి ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు, బావులు మండు వేసవిలోనూ నిండా నీటితో కళకళలాడుతున్నాయి. భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా పాలేరు రిజర్వాయర్ నుంచి అధికారులు ముందస్తుగా మండలంలోని అన్ని చెరువులకు నీరు నింపడంతో కష్టాలు తీరినట్లయింది.

ఐదు దఫాలుగా విడుదల

మండలంలో యాసంగి పంటలు సాగు చేసే రైతులు సాగునీటికి ఇబ్బంది పడకుండా రాష్ట్ర మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో అధికారులు ఐదుసార్లు భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు నీరు విడుదలచేశారు.దీంతో చెరువులు నిండగా.. సాగు పనులు పూర్తయ్యాక మే నెలలోనూ కళకళలాడుతున్నాయి. మండలంలోని బచ్చోడు, సుబ్లేడు,ఎదుళ్లచెరువు, పిండిప్రోలు, కొక్కిరేణిబీరోలు, పాతర్లపాడు తదితర గ్రామాల చెరువులు నిండుకుండల్లా మారాయి. దీంతో వేసవిలోతాగునీటికి, వచ్చే ఖరీఫ్‌లో సాగునీటి కష్టాలుతీరినట్లేనని ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదికాక చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉడడంతో చేపల పెంపకానికి కూడా ఇబ్బందులుఉండవని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో వర్షాలువచ్చేవరకు సాఫీగా పంటలు సాగు చేసుకోవచ్చనిఅన్నదాతలు చెబుతున్నారు.

అందరికీ ఉపయోగమే....



భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా మండలంలోని అన్ని చెరువులను నింపారు. దీంతో ఎండా కాలంలోనూ చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయి. సాగు, తాగునీటికి ఇబ్బందులు తీరినట్లే. అలాగే, బావులు, బోర్లలో కూడా నీటిమట్టం పెరిగింది. అంతేకాక చేపల పెంపకానికి సమస్యలు ఉండవు.

–పి.వెంకటనర్సయ్య, మత్స్యకారుడు, ఎదుళ్లచెరువు

డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీ ఒకేషనల్ తదితర కోర్సుల్లో 2, 4, 6వ సెమిస్టర్లు, బ్యాక్‌లాగ్ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షల టైంటేబుల్ ప్రకటించారు. ఈమేరకు వివరాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, వెంకటయ్య ఓ ప్రకటనలో వెల్లడించారు.

సెమిస్టర్ల వారీగా పరీక్షలు ఇలా..

రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14, 16, 19, 21, 23, 26, 28, 30వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం5గంటల వరకు నిర్వహిస్తారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలను ఈ నెల 15, 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నారు. అలాగే, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14, 16, 19, 21, 23, 26, 28, 30, జూన్ 3, 5, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. ఇక మొదటి సెమిస్టర్ పరీక్షలను జూన్ 17, 18, 20, 21,23,24,25వ తేదీల్లోమధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు, మూడో సెమిస్టర్ పరీక్షలు జూన్ 16, 17, 18, 19, 20, 21, 23, 24, 25 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఐదో సెమిస్టర్ పరీక్షలను ఈనెల 17, 20, 22, 24, 27,29, 31,జూన్ 4,10,11,12,13, 16వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నారు.

వేలంపాటలో రూ.5.21లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయంలో వివిధ పనులకు గురువారం వేలం నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యాన దుకాణాల సముదాయం కేటాయింపు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడం, టెంట్ సామగ్రి అద్దెకు ఇచ్చేందుకు వేలం నిర్వహించగా, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు గుగులోతు నవీన్ రూ.15,500తో దక్కించుకున్నారు. అలాగే, షాపులు ఒక్కొక్కటి గత ఏడాది రూ.28,800కి ఇవ్వగా, ఈసారి రూ.31,800 ధర పలికాయి. తద్వారా ఆరు షాపుల ద్వారా రూ.1,90,800, టెంట్ సామగ్రి సరఫరాను గుగులోతు దస్రు రూ.3.15లక్షలతో దక్కించుకున్నాడు. మొత్తంగా రూ.5,21,300 ఆదాయం నమోదైందని ఈఓ వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో వేసవి శిబిరాలు

- ఈనెల 10నుంచి 46స్కూళ్లలో నిర్వహణ
- 4,600మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ



విద్యార్థులకు క్యారమ్స్ శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయిని (ఫైల్)

నేలకొండపల్లి: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 10 నుంచి 24వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యాన ఈ శిబిరాల నిర్వహణకు ఆదేశాలు జారీ అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు.

46 ఉన్నత పాఠశాలలో...

జిల్లాలోని 46 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒక్కో పాఠశాలలో కనీసం వంద మంది చొప్పున 4,600 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఒక్కో కేంద్రంలో నలుగురు శిక్షకుల సాయంతో కనీసం నాలుగు అంశాల్లో తర్ఫీదు ఇవ్వాల్సి ఉంటుంది. కాగా, శిక్షణ సమయాన విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వనుండగా, శిక్షకులకు గౌరవ వేతనం అందిస్తారు.

ప్రవేశాలు ఇలా....

శిబిరాల్లో ప్రవేశానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. మొదటి రోజు ఆధార్‌కార్డు, పాఠశాల వివరాలతో హాజరైతే ప్రవేశం కల్పిస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వచ్చేలా ఉపాధ్యాయులు ఇప్పటికే సమాచారం సమాచారం ఇస్తున్నారు.

అంశాలు ఇవే...

మండల కేంద్రాలో వనరులు, శిక్షకులు సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని శిక్షణ అంశాలను ఎంపిక చేశారు. చదరంగం, క్యారమ్స్, స్కిప్పింగ్, వైకుంఠపాళి తదితర ఆటలే కాక, డ్రాయింగ్, పెయింటింగ్, సాధన కాగితాలతో బొమ్మలు తయారు చేయడంపై శిక్షణ ఉంటుంది. అంతేకాక చిన్నచిన్న సైన్స్ ప్రయోగాలు, కర్రసాము, యోగా, నృత్యం, సంగీతం, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ బేసిక్స్ నేర్పిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి..



తొలిసారిగా గ్రామీణ విద్యార్థులకు ఉపయోగపడేలా మండల కేంద్రాల్లో వేసవి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ఆసక్తి ఉన్న అంశాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చు.

– సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి

రిటైర్డ్ ఎంఈఓకు పలువురి నివాళి



శేషభూషణం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి తదితరులు

తల్లాడ: తల్లాడకు చెందిన రిటైర్డ్ ఎంఈఓ బాజోజు శేషభూషణం సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన శేషభూషణం సంతాప సభ గురువారం నిర్వహించగా సీనియర్ పాత్రికేయులు కొండుభట్ల రామచంద్రమూర్తి నివాళులర్పించి మాట్లాడారు. తల్లాడ జెడ్పీహెచ్ఎస్‌లో శేషభూణంతో కలిసి తాను పదో తరగతి వరకు చదివానని, ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విద్యారంగానికి సేవ చేశారని తెలిపారు. అలాగే, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య తదితరులు మాట్లాడగా.. చల్లా కృష్ణారావు, డాక్టర్ వేమిశెట్టి ఉపేందర్‌రావు, గుంటుపల్లి సత్యం, కోటమర్తి రాధాకృష్ణమూర్తి, సుబ్బయ్య, శరత్‌బాబు, సూరిబాబు, రామకృష్ణ, లక్ష్మయ్య, తిరుపతిరెడ్డి, శ్రీనివాసరావు, రఘుపతిరెడ్డి, ముత్యాలు, నర్సయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 25మంది ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఎంఆర్ఎఫ్ కంపెనీలో ఉద్యోగాలకు నిర్వహించిన ఈ మేళాకు 48 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ పరీక్షల అనంతరం 25మంది ఉద్యోగా లకు ఎంపిక చేసి నియామకపత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్. మాధవి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైందని యువతి ఆత్మహత్య



భూక్యా కల్యాణి (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించటంతో మనస్తాపానికి గురైన ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. పెనుబల్లి మండలం బ్రహ్మళ్లకుంట గ్రామానికి చెందిన భూక్యా కల్యాణి(22) సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వర్తిస్తోంది. కొంత కాలంగా పెనుబల్లి మండలానికి చెందిన యువకుడిని ప్రేమిస్తుండగా, ఇటీవల ఆయన పెళ్లికి నిరాకరించాడని తెలిసింది. దీంతో సత్తుపల్లిలోని మసీద్ రోడ్డులో అద్దెకు ఉంటున్న ఇంట్లో బుధవారం రాత్రి చీరతో ఉరి వేసుకు ని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కవిత తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

వైరారూరల్: మద్యానికి బానిసైన ఓ యువకుడు పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గన్నవరానికి చెందిన శీలం ఉపేందర్‌రెడ్డి(31) మద్యానికి బానిస కాగా తల్లిదండ్రులు మందలించారు. దీంతో 2వ తేదీన పురుగుల మందు తాగిన ఆయన ఖమ్మం ఆస్పత్రికి తరలింగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన తండ్రి వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ తెలిపారు.

వీ.వీ.పాలెంలో వృద్ధుడు...

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన చీటి కోటయ్య(79) అనారోగ్యంతో బాధపడుతూ గడ్డి మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చికిత్స చేయించుకున్నా ఫలితం లేక మనస్తాపంతో బుధవారం గడ్డి మందు తాగాడు. ఈ విషయం గమనించిన బంధువులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోటయ్య కుమారుడు మల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

ఆటో బోల్తా, కూలీలకు గాయాలు

కూసుమంచి: కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడగా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. కూసుమంచిలోని గంగాదేవి గుడి సమీపాన గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన కూలీలు ట్రాలీ ఆటోలో మిర్చి ఏరేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా గంగాదేవి ఆలయ సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఎనిమిది కూలీలకు గాయాలు కాగా, ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అయితే, అక్కడ సరైన చికిత్స అందక ఇబ్బందులు ఎదురయ్యాయని క్షతగాత్రులు వాపోయారు.

లారీని ఢీకొని యువతికి..

వైరా: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువతి ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం పాతమున్సిపాలిటీ కార్యాలయంలోని లైబ్రరీ లో కాంట్రాక్ట్ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న అడపా భవాని వైరా మండలం గన్నవరంలో జరిగే స్నేహితురాలి వివాహానికి గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. వైరా బాలాజీనగర్ పాత శివాలయం సమీపాన ఆగిఉన్న లారీని వెన క నుంచి ఢీకొనడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యా యి. స్థానికులు 108కు సమాచారం ఇచ్చినా అందుబాటులోకి రాకపోవడంతో అటుగా వస్తు న్న వైరా ఆర్ఐ ప్రసాద్, తదితరులు భవానీని తన కారులో వైరా పీహెచ్‌సీకి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అయితే, భవానీ ద్విచక్ర వాహనం కొనుగోలుచేసి మూడు రోజులే అయినట్లు తెలుస్తుండగా ఇంతలోనే ప్రమాదం జరగడం గమనార్హం.

జాలరికి చిక్కిన అరుదైన చేప!

మండలంలోని పైనంపల్లి ఏటిలో జాలరికి అరుదైన చేప చిక్కింది. గ్రామానికి చెందిన ఉపేందర్ రోజుమాదిరిగానే ఏటిలో చేపల కోసం వల వేశాడు. అందులో అరుదైన చేప చిక్కింది. దీన్ని దెయ్యంబేరు చేప అంటారని, ఇవి ఎక్కువగా సముద్రంలో జీవిస్తాయని స్థానిక మత్స్యకారులు తెలిపారు.

– నేలకొండపల్లి



వలలో పడిన దెయ్యంబేరు చేప

సైనికులకు వందనం!



'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడి చేసిన విషయం విదితమే. ఈ అంశంపై అన్నివర్గాల ప్రజలు సంబురాలు జరుపుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఏన్కూరు మండలం ఆరికాయలపాడులోని ఉపాధి హామీ కూలీలు సైతం గురువారం జాతీయ పతాకం చేబూని భారత్‌మాతకు జై అంటూ నినాదాలు చేస్తూ సైన్యాన్ని అభినందించారు.

– ఏన్కూరు

ఆటో బోల్తా, డ్రైవర్ మృతి

బంధువుల ఇంటికి వెళ్తుండగా ప్రమాదం

ఖమ్మంఅర్బన్: అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఖమ్మంలోని ధంసలాపురం వద్ద చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా ఎర్రబోడు కాలనీకి చెందిన చేపూరి వెంకన్న(35) ఆటోడ్రైవర్ జీవనం సాగిస్తున్నాడు. మహబూబాబాద్ నుండి చింతకాని మండలం నామవరంలోని బంధువుల ఇంటికి శుక్రవారం ఆయన ఆటోలో వస్తుండగా, ఖమ్మం – బోనకల్లు రోడ్డులోని ధంసలాపురం ఫ్లైఓవర్ దాటాక ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో బ్రేక్ వేయగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే, ఆటోలో ఉన్న మహేష్, ఓ చిన్నారికి గాయాలయ్యాయి. కాగా, వెంకన్న మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన మార్చురీకి తరలించగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడు మృతి

టేకులపల్లి: అనారోగ్యంతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాంధీపురానికి చెందిన పాదెం భద్రం (42) తొమ్మిది నెలల క్రితం బోడు జెడ్పీహెచ్ఎస్‌కు బదిలీపై వచ్చాడు. ఆయన కొంతకాలంగా కామెర్లు, లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లచికిత్స చేయిస్తుండగా గురువారం మృతి చెందారు. మృతుడికి భార్య రేణుక, కుమార్తె దర్శిని, కుమారుడు డ్యానీ ఉన్నారు. భార్య పెట్రాంచెలక స్టేజీ ప్రాథమిక పాఠశాలలో ఉపాయురాలిగా పనిచేస్తోంది. కాగా, భద్రం మృతిపై టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి, బోడు ఉన్నత పాఠశాల హెచ్ఎం అజ్మీరా జగన్‌నాయక్, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ఆడశిశువును వదిలేసిన కుటుంబీకులు



ఆస్పత్రి ఉద్యోగి వద్ద శిశువు

ఖమ్మంవైద్యవిభాగం: కారణాలు ఏమిటో తెలియదు కానీ గుర్తుతెలియని వ్యక్తులు పది నెలల వయస్సు పాపను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం వదిలేసి వెళ్లారు. ఆడపిల్లల అక్రమ దత్తతను అరికట్టేలా మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 'ఊయల' ఏర్పాటుచేయగా, అందులో పాపను వదిలారు. సెక్యూరిటీ ద్వారా తెలుసుకున్న అధికారులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వగా, వారు పాపను చేరదీసి శిశు గృహకు తరలించారు. అయితే, పాపను ఎవరు వదిలేసి వెళ్లారనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.